


(21 వ భాగము)

ఆమె మాటతో నాలో కలిగింది కేవలం అనుమానమే నన్న నిర్ణయానికి వచ్చాను. మళ్ళీ నా మెదడు రానున్న ప్రమాదంనుండి తప్పించుకొని పోగలిగేందుకు ఏదైనా దారి దొరుకుతుందాని ఆలోచించసాగింది.

అన్నింటినీ మించి అసలు శాస్త్రజ్ఞులు ఊహించినట్లుగా విషపు గాలులు వీస్తాయా? లేక వాతావరణంలో అనుకొని అవాంతరం జరిగి మార్పు సంభవించి, ఈ దీవిపైకి రావలసిన గాలులు, మరో దిక్కున వెళ్ళి, ఇంకెటో వెళ్ళటం కూడా సంభవించవచ్చునేమోనన్న ఆశ కూడా కలిగింది.

నేను డెల్లా బొంబాయి ప్రాంతపు సముద్రంలో కలుసుకున్నది మొదలు ఇప్పటిదాకా ఎన్నో రకాల కష్టాలను, ప్రమాదాలను, ప్రాణాపాయకరమైన పరిస్థితులను ఎదు

రొక్కున్నాం. బ్రతికి బైటపడ్డాం. అవన్నీ ఒక ఎత్తుగానూ, ప్రస్తుతం చిక్కుకున్న పరిస్థితులు ఒక ఎత్తుగానూ కనుపించ సాగాయి.

బ్రతికి బైటపడగలమన్న నమ్మకం నాలో నశించి చాలా సేపయింది. డెల్లా గుండెలో ఏముందో నాకు తెలీదు. పైకి మాత్రం ఇద్దరం గంభీరంగానే వున్నాం. మా ఇద్దరి చిన్న జీవితాలు సుఖాన్ని చవిచూడకుండా, మానవాళికి ఏ కొంచెమైనా మంచి చెయ్యకుండానే అంతమైపోతున్నందుకు బాధ కలిగింది. అది నా గుండెల్ని పిండిచేసింది

చావు తప్పదని తెలిసొచ్చాక, దొంగగా, స్మగ్లర్‌గా నేను బ్రతికిన దినాలు, ఎంత ఏహ్యమైనవో అర్థం కావస్తూంది. ఈ ప్రమాదం తప్పి, ప్రాణాలతో బైటపడితే, నా జీవనమార్గం మార్చుకోవాలనీ, పదిమందికీ పనికొచ్చే విధంగా బ్రతకాలనీ, తీర్మానించుకున్నాను.

"ఏమిటి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నావ్?" అడిగింది డెల్లా.

"ఏమీ లేదు!" అన్నాను ఆమెకు నా మనస్సులో వున్న విషయాలు విప్పి చెప్పి నవ్వులపాలు కావడం ఇష్టంలేక.

"మిస్టర్ రాజ్! ఈ ప్రమాదంలో మనం ఇద్దరం బ్రతికినా, చచ్చినా ఫరవాలేదు. ఏవిధమైన సమస్యా వుండదు. అలా గాకుండా ఒకరు బ్రతికి మరొకరు చనిపోతే, బ్రతికిన మనిషి చచ్చిన శవాన్ని ఏంచెయ్యాలి?" అడిగింది.

"ఆ అనుమానం నీ కెందుకొచ్చింది!" అడిగాను నేను.

"రాకూడదా?"

"మనం కలసి వుండాలనుకున్నాం - చావులో బ్రతుకులో."

"అనుకున్నంత మాత్రాన జరిగిపోదు. విషపు గాలుల తాకిడికి నువ్వు తట్టుకోగలగవచ్చు. నేను అలా చెయ్య లేక చచ్చిపోవచ్చు. అలాగే భూమిలో మనం తలలు పెట్టాక, అక్కడ దొరికే కొద్ది ఆక్సిజనుతో నువ్వు కష్ట పడి వూపిరి తీసుకోగలగవచ్చు. నాకు అది సాధ్యం కాక పోవచ్చు" అంది డెల్లా.

"అయితే నువ్వే చెప్పు ఏం చేయాలో?" అడిగాను.

"నేను చనిపోతే, నా శవాన్ని ఇక్కడే ఎక్కడన్నా పాతిపెట్టు. ఈ లాకెట్ మా తల్లిదండ్రులకు చేర్చు. వాళ్ళకు నన్ను పాతి పెట్టిన ప్రదేశం ఎక్కడుందో వివ రంగా చెప్పు చాలు" అంది డెల్లా.

"మరి నేను చనిపోతే?" అడిగాను.

"ఏం చెయ్యమంటావ్?" అడిగింది.

"ఇక్కడే పాతిపెట్టెయ్యి. ఆ మట్టిమీద రెండు కన్నీటి బొట్లు రాల్చు, చాలు" అన్నాను.

"రాజ్! అలా జరగదు. జరిగితే నీ విడోగా బ్రతుకు తాను. యూ ఆర్ మై హజ్ బెండ్ డోనాట్ మారీడ్" అంటూ బలంగా నన్ను కౌగలించుకొంది డెల్లా.

"రియల్లీ?" అడిగాను నమ్మలేనట్లు.

నిజమని నోటితో చెప్పకుండా కౌగిలిని మరింత బిగించింది.

మే మిద్దరం భార్యా భర్తలం.

మంగళ వాద్యాల మధ్యలో, చర్చి గంటల క్రిందనో, అందరూ పెళ్ళిళ్ళు చేసుకుంటారు. కానీ మేము నిర్మా

నుష్యమైన ఎడారిలో, సముద్రపుఅలలు హోరుల మధ్య, పంచ భూతాలు మాత్రమే సాక్ష్యాలుగా, పరస్పరాంగీకారంతో భార్యాభర్తల మైనాం. అదీ చావుకు ఎనిమిది గంటల ముందు, ఇలాంటి దాంపత్యం ప్రపంచలోనే అరుదుగా కనుపిస్తుందనుకున్నాను.

"డెల్లా!" నా గుండెలపైన ఆమె తల వుంది. తల వొంచి నేను మెల్లగా పిలిచాను చెవిలో నోరుపెట్టి.

"అఁ!" అంది.

"మనం ఈ అనుబంధం సెలబ్రేట్ చేసుకొందామా?" అడిగాను నవ్వుతూ.

"సిల్లీ!" అంది.

"కాదు! ఎటూ చావబోతున్నాం. కనీసం ఆత్మతృప్తితో నన్నా చద్దాం!" అన్నాను. ఆమె రెండు భుజాల్ను చేతుల్లో పట్టుకొని, డెల్లా నాకు అభిముఖంగా వుంది. ఆమె కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. అంతకుముందెప్పుడూ అలాంటి తళుకూ, వెలుగూ, నేనామె కళ్ళల్లో చూడలేదు. బహుశా నాలోనూ అలాంటి మార్పు గమనించి వుండవచ్చుననుకున్నాను.

ఇద్దరం ఇసుకలోంచి లేచాం.

"ఎక్కడకు?" అంది డెల్లా గోముగా.

"శోభనానికి!" అన్నాను.

ఆ మాటతోనే నాపైకి ఒరిగిపోయి లతలా నన్నల్లుకుపోయింది. ఆమె బలమైన లావుపాటి రొమ్ములు నా వొంటికి గీచుకున్నాయి. ఆ రాపిడి తియ్యని తిమ్మరిని లేపింది రక్తంలో.

"ఆ బిల్డింగ్ కు వెళ్దాం!" అన్నాను.

ఆమె నా చెయ్యిపట్టుకొని నడవసాగింది.

ఇద్దరం అడుగులో అడుగు వేసుకుంటూ బిల్డింగ్ వైపు నడిచాం.

క్రిందిభాగంలో వున్న గదుల తలుపులన్నీ తెరచి చూశాం. చివర్న ఒక బెడ్ రూం కనుపించింది. డెల్లాను అందులో వదలి నేను పైకెళ్ళాను. రెండు విస్కీసీసాలూ తినేందుకు కొన్ని బిస్కట్లు మొదలైనవి తెచ్చాను.

ఆరు గంటలసేపు ఈ లోకాన్ని మరచిపోయి మా లోకంలో మేమున్నాం. అంతసేపూ ప్రతిక్షణం ఆనందం అనుభవించాం. విరామం లేకుండా, విసుగు పుట్టకుండా కరిగిపోయింది కాలం.

ఆఖరి ఆటవిడుపులో "టైమెంత!" అడిగాను డెల్లాను.

చెప్పింది ప్రక్కనున్న అలారం టైంపీస్ చూసి.

"అయితే ఇంకో గంటన్నర మాత్రం వుంది. వెళ్దామా!" అడిగాను.

"ఆఁ!" అంది.

చాలా హాయిగా అనిపించింది మనస్సుకు. ఆ తర్వాత మాసామగ్రి తీసుకొని బయలుదేరాం, అంతకుముందు మేము గోతులు త్రవ్వి పెట్టుకున్న ప్రాంతానికి.

కొద్దిగా గాలి ప్రారంభమయింది. దాంతోపాటు దొర్లుకుంటూ వచ్చిన ఇసక అంతకుముందు మేముచేసిన గోతుల్ని కొంతవరకు పూడ్చింది.

నేను చేతుల్తో ఆ ఇసకంతా ఎత్తి ప్రక్కన పోసి మళ్ళీ యథాప్రకారం తయారుచేశాను.

"ఈ గాలి మనమనుకున్నట్లు పెద్దదయితే సజీవ సమాధి అవుతాం" అంది డెల్లా.

"చిన్న గాలికే ఇంత ఇసుక కొట్టుకొస్తే, తుఫాను లాంటిదేదన్నా వచ్చిందంటే పెద్ద మేడ పడిపోతుంది" అంటూ "అందుకే మన వివరాలు తెలుపుతూ ఆ బిల్డింగులో ఉత్తరం రాసిపెట్టింది" చెప్పాను.

అప్పటిదాకా వున్న పొడివున్న గాలిలో తేమ ఎక్కువయింది. ఆకాశంలో వెలుతురు కూడా సన్నబడింది. పది నిమిషాల్లో మొత్తం చిమ్మచీకటి క్రమ్మేసినట్లయింది.

"ఏమిటీ మార్పు?" అడిగింది డెల్లా.

"ఏమో?" అర్థంగాక చూశాను.

"విషపు గాలులు రాబోయేముందు వాతావరణం ఇలా మారిపోతుందా" అడిగింది డెల్లా.

"ఇలాగని అక్కడి నోట్స్‌లో లేదు. ఇదేదో విచిత్రంగా వుంది" అన్నాను.

తలెత్తి ఆకాశంవేపు చూశాను.

అందాకా పల్చగా పారాడుతున్న మేఘాలు ఒకదాంతో ఒకటి చేరుకుని చిక్కబడి నల్లబడ్డాయి. వర్షం జోరుగా రాబోయేట్లుగా వుంది. దీనివల్ల మా ప్లాన్ పనిచెయ్యదన్న అనుమానం కలిగింది.

వర్షపు నీళ్ళు ఇసకలోకి సులభంగా దిగిపోతాయి. గాలిని మాకు అందనీకుండా నీటిపొరలు అడ్డుపడ్డాయంటే, దొరికే ఆ కాస్త ఆక్సిజన్ కూడా దొరక్క చావల్సి వస్తుందేమోనన్న భయం పట్టుకొంది.

ఉరుములు ప్రారంభమైనాయి.

మా దీవిని వెలుతురులో లిప్తపాటు తడపాలనుకున్నట్లు అప్పుడప్పుడూ మెరుపులు కనుపించాయి.

"మనం ప్రాణాలు కాపాడుకునేందుకు బుర్రలు బద్దలు

కొట్టుకొని తయారుచేసుకున్న పథకం కాస్తా పనికిరాని దయిపోయేట్లుంది!" అంది డెల్లా నిరాశగా.

మరో మార్గమేదన్నా దొరుకుతుందాని ఆలోచించ సాగాను. ఎంత ఆలోచించినా వేరే దారి కనుపించలేదు.

శాస్త్రజ్ఞులు వేసిన అంచనాకు మరో ఇరవై ఆరు నిమిషాలు మాత్రమే వ్యవధి వుంది.

ఆకాశంలో మెరుపులు ఎక్కువయినాయి. దిక్కులు పిగిలిపోతున్నట్లుగా భయంకరమైన శబ్దంతో చెవుల్ని చిల్లులు పొడిచాయి ఉరుములు.

గాలిలో నాకేదో ఒకరకమైన వింతవాసన వస్తున్నట్లు అనిపించింది. ఆ వాసనకు ముక్కుపుటాలు మంట పుట్టిన ట్లయింది. కళ్ళు బైర్లుకమ్ముతున్నట్లు శరీరం చేదెక్కు తున్నట్లుగా తోచింది.

నా అనుభవం చెప్పాను డెల్లాకు.

ఆమెకూ అలాగే ఉందని చెప్పింది.

విషపు గాలులు వీచడం ప్రారంభమయింది. ఇక ప్రయ త్నాలు, పథకాలు అమలుపరచక తప్పదనిపించింది.

"డెల్లా!" పిలిచాను.

"ఆఁ!" అంది.

"మనం ఆత్రుతగా, భయంగా, ఎదురుచూసిన ఆ విషపు గాలి రావడం ప్రారంభమైంది. మనం మన గోతుల్లోకి దిగుదామా!" అడిగాను.

"దిగుదాం!" అంది డెల్లా.

ఆఖరిసారి అన్నట్లు ఆమెను ఘట్టిగా కౌగలించు కున్నాను. పెదాలలోని రక్తమంతా జుర్రుకొని త్రాగేట్లు ముద్దుపెట్టుకున్నాను.

ఒకర్నొకరు శాశ్వతంగా వదలి వెళుతున్నట్లుగా బాధ పడ్డాం. ఆ బాధ గుండెల అడుగులోంచి వచ్చినట్లుగా వుంది నాకు.

అంతకు ముందు అనుకున్న ప్రకారం ఇద్దరం తలలు గోతుల్లో పెట్టుకున్నాం. నేను తల దగ్గర అలారం టైం పీస్‌ను పెట్టుకున్నాను. మెల్లగా చేతుల్తో గొయ్యి చుట్టూ వున్న మట్టిని లోపలకు త్రోసుకున్నాను. నా తల పూర్తిగా మట్టిలో మునిగిపోయింది. మెడ భాగం గుండె మిగిలిదంతా వెలుపలే వుంది.

డెల్లా కూడా అలాగే చేసుకుని వుంటుందనుకున్నాను.

టక్ టక్ మంటూ గడియారం చేస్తున్న శబ్దం వినిపిస్తూంది. కళ్ళ చుట్టూ చీకటి తప్ప మరేం కనుపించలేదు నాకు.

వెలుపల వాతావరణం క్షణ క్షణానికీ చల్లబడుతున్నట్లుగా వుంది. అది నా కాళ్ళకు తగులుతున్న గాలినిబట్టి గ్రహించాను.

క్షణాలు జగిగినకొద్దీ చలి ఎక్కువవుతున్నట్లు అనిపించసాగింది. అలా అరగంటదాకా చలి ఎక్కువవుతూనే వుంది. నా దగ్గరున్న టైం ప్రకారం ఈపాటికి విషపు గాలులు ప్రారంభమయివుండా లనుకున్నాను. అయితే ప్రారంభమయిందీ లేనిదీ తెలిసే మార్గం మాత్రం లేదు.

మరో గంట గడిచింది.

నాకు ఊపిరి అందటం కష్టంగా వుంది.

భూమిలో లభించే గాలుల్లో ఆక్సిజన్ పాలు అంత ఎక్కువగా లేనట్లుంది. మనిషికి కావలసినంత దొరకదని నిర్ధారణగా తెలిసింది. అందువల్ల బాగా దమ్ముపట్టి, గాలి

చాలా మెల్లగా పీల్చసాగాను. అలాగే నిదానంగా వదలటం మొదలుపెట్టాను.

కాళ్ళకూ, మెడ పైభాగానికి ఏవో సూదులతో పొడిచినట్లు బాధ పుట్టసాగింది.

అది విషపు గాలులవల్లనేమో ననుకున్నాను. ఆ తర్వాత అది చలి ఎక్కువ కావడంవల్ల కలుగుతున్న అనుభవమని అర్థం చేసుకున్నాను.

ఆ నొప్పి బాగా ఎక్కువయింది. బాధకు కాళ్ళు నిశ్చలంగా నిలబెట్టలేకపోయాను. అటూ ఇటూ వాటంతటవే కొట్టుకోసాగాయి. నా ప్రయత్నమూ, ఓర్పు, దాన్ని ఆపలేక పోయాయి.

ఇంకొంత సేపటికి సన్నటి చినుకులు కురుస్తున్నట్లు గ్రహించాను.

అతి త్వరలోనే చినుకులు పెద్దవైనాయి. లావుపాటి చినుకులు కర్రలతో కొట్టినట్లు కాళ్ళపై పడి నెప్పి పుట్టాయి.

నా బాధ నాకు అర్థమవుతూంది.

డెల్లా ఎలా తంటాలు పడుతుందోనన్న ఆతృత, ఆరాటము ఎక్కువయినాయి నాకు. మేమిద్దరం భార్యాభర్తలం అనుకొన్న తర్వాత నా ఆవేదన నాకు తెలీకుండానే మిక్కుటమైంది.

లావుపాటి రాళ్ళేవో నా శరీరంపై పడ్డట్టు ఫీలయినాను. ఒక్కొక్కటి పైన పడుతుంటే ఎముకలు విరిగి పోతాయేమో ననిపించింది. అలా రాళ్ళు ఎవరు విసురుతున్నారా అని ఆశ్చర్యపోయాను. అవి కాళ్ళపై పడ్డాక రాళ్ళు కాదనీ, వడగండ్లని తెలుసుకున్నాను. విసు

గడ్డలవి. కాలిపై పడ్డప్పుడు అది పడ్డమేరకు చర్మం చల్లబడి బిరుసెక్కిపోయి నట్లనిపించింది. రక్తప్రసారం కూడా ఆగిపోయింది కొంతసేపు.

ఆ వడగండ్ల వాన, అపులేకుండా దాదాపు అరగంట సేపు కురిసింది. నా శరీరంపైన ఏదో పెద్ద బరువు పెట్టి నట్లుంది. అంటే నా వొళ్ళు మొత్తం వాటి క్రింద పడి పోయిందనిపించింది. అది ఆగిందో లేదో నాకర్థం కాలేదు.

కాళ్ళు కదల్చటానికి, చేతులు ఊపటానికి ఏవిధమైన అవకాశం అణుమాత్రం కూడా లేకుండాపోయింది. నేనూ నాలాగే డెల్లా, ఇద్దరం సజీవ సమాధి కాబడ్డాం అని తెలుసుకున్నాను.

నేను ఎదురు చూచిన ఇసక తుఫాను రాలేదు. కానీ ఎటూ ఊహించని వడగండ్ల వాన వచ్చి మమ్మల్ని భూ స్థాపితం చేసింది.

బ్రతకటానికున్న ఒకే ఒక అవకాసం, జాగ్రత్తగా, గాలి పీలుస్తూ, వదలడం. దానికీ శక్తి సన్నగిల్లిపోయింది. అలాగే నా అంచనా ప్రకారం ఐదారు గంటలసేపు తంటాలుపడి వుంటాను ప్రాణాలు నిలబెట్టుకునేందుకు. మంచుగడ్డలవల్ల శరీరం మొత్తం చల్లబడిపోయి వుంది. ఆ చలి గుండెల్లోకి చేరింది.

ఎంత ప్రయత్నించినా, ఎందువల్లో ఊపిరి పీల్చుకో వడం కష్టమవుతూ వుండటం గ్రహించాను. అలాగే కొంతసేపు తన్నుకులాడాను. డెల్లా చెయ్యి నా చేతిలో పడింది. ఆమె చేతిని పట్టుకొన్న నా చేతి వ్రేళ్ళ పట్టు వదులు కాసాగింది. స్పర్శ్యాజ్ఞానం నశించిపోసాగింది. స్పృహ కూడా పోతున్నట్లుంది. నిగ్రహించుకున్నాను.

శరీరంలోని సత్తువంతా కూడగట్టుకొని పోరాడాను. మరో పది నిముషాలు గడిచాయి. ఆ తర్వాత నాకే మయిందో తెలీలేదు.

* * *

కుడి పిరుద మీద ఏదో గుచ్చినట్లనిపించింది.

కళ్ళు తెరవాలనీ, చుట్టూ ఏముందో చూడాలనీ అనిపించింది. మూసుకున్న రెప్పలు ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. గుడ్లు నైట్రిక్ ఆసిడ్‌లో తడిసినట్లు మంట పుట్టాయి. కణతలు కూడా మండాయి. లాభం లేదని ఆ ప్రయత్నం మానుకున్నాను.

గచ్చుమీద అప్పుడప్పుడు పడుతున్న మెత్తటి బూడ్సుల అడుగుల చప్పుడు వినరాసాగింది. నేనెక్కడున్నానో తెలుసుకోనేందుకు ఆతృతగా వున్నా, కళ్ళు తెరచి చూడలేకపోవడం, నోరు విప్పి మాట్లాడలేకపోవడం పెద్ద అవరోధాలుగా తయారయ్యాయి.

"అతనికి స్పృహ వస్తూంది" ఎవరో అన్న మాటలు నా చెవిన పడ్డాయి.

"నిజంగా! వుయ్ ఆర్ లక్కీ! ఇంకో ఇంజెక్షన్ ఇవ్వండి" అరిచాడు మరో మనిషి. అతని గొంతు బొంగురుపోయినట్లుంది.

"ఇతను బ్రతకడని అన్నారు మీరంతా. నాకెందుకో బ్రతుకుతాడన్న నమ్మకం మొదట్నుంచీ వుంది" మొదటి గొంతు మళ్ళా వినిపించింది.

"మీరు ఇంత ఓర్పుగా ఇన్ని రోజులు అతన్ని అవరింపన మృత్యువుతో పోరాడారు. మీరు డాక్టరుగారు. చివుడులాంటివారు" ఇంకొకతను అంటున్న మాటలు వినబడ్డాయి.

వాళ్ళ సంభాషణనుబట్టి నాకు కొంత అర్థమయింది. నేను చాలా దినాలనుండి 'కోమా'లో వున్నాను. నన్ను ఆ డాక్టరెవరో పుణ్యం కట్టుకొని బ్రతికించాడు. కానీ డెల్లా ఏమయింది? ఎక్కడుంది? అసలు బ్రతికి వుందా? లేదా? అన్న ప్రశ్నలు నా మెదడ్ను పురుగుల్లా తొలిచాయి. ఆమె గుర్తుకు రాగానే, పాత విషయాలు కూడా గుర్తొచ్చాయి. నాకు స్పృహ కోల్పోయేముందు ఏమేంటి జరిగింది సినిమా బొమ్మల్లా కదిలింది కళ్ళముందు.

ఘోరమైన విషపు గాలుల్ని తట్టుకొని, బ్రతికి ప్రాణాలతో బైట పడటం మరచిపోలేని సంఘటన. దానినుంచి నాతోనే డెల్లా కూడా తప్పుకుందో, లేదో తెలుసుకుందామని చాలా ఆతృతగా వుంది. గొంతు పెకిలించుకున్నా మాట రావటం లేదు. స్వరపేటిక ప్రక్కనున్న నరాలేవో నలిగిపోయినట్లు అనిపించింది.

ఎడమవేపు పిరుదుపైన మళ్ళా ఇంజక్షను చేసినట్లున్నారు. నొప్పి పుట్టింది. ఆ మందేదో రక్తంలో కలిసిపోతూంటే వొళ్ళంతా తిమ్మిరెక్కినట్లయింది. కళ్ళు మళ్ళీ నొప్పి పుట్టాయి. మైకంలాంటిదేదో శరీరాన్ని ఆవరించింది. చైతన్యం చచ్చిపోయినట్లయింది. నన్ను నాకు గుర్తు లేకుండాపోయింది.

ఇలాగే ఐదారుసార్లు జరిగింది. స్పృహ తెలిసినప్పుడల్లా నా చుట్టు ప్రక్కల తిరుగుతున్న. మనుషులు మాట్లాడుకుంటున్న విషయాల్ని తదేకంగా విని, వాటి నుంచి నాకేం జరిగిందో, నన్ను మామూలు మనిషిని చెయ్యడానికి వాళ్ళు ఎటువంటి ప్రయత్నాలు చేస్తున్నారో తెలుసుకుందామని ప్రయత్నించసాగాను. అన్నిం

టినీ మించి జీల్లాకేలా వుందో కనుక్కుందామని ఆశిం చాను. కానీ అదే తెలియలేదు.

కళ్ళు తెరచాను.

గదినిండా పరుచుకున్న మెర్క్యురీలైటు వెలుగు తెల్లగా కనుపించింది. మెడ కొద్దిగా త్రిప్పి చూశాను. ఎవ్వరూ కనుపించలేదు. ఆ గదిలోని ఫర్నిచర్, పెయింటు మొదలైనవాట్నిబట్టి నేను నిశ్చయంగా ఏదో హాస్పిటల్ రూమ్‌లో వున్నానని నిర్ధారించుకున్నాను.

లేచి కూచుందామనిపించింది. ప్రయత్నించాను. కానీ నడుం పట్టుకుపోయినట్లుంది. కూర్చోలేకపోయాను. కాళ్లు, చేతులూ కదిలించాను. అవి నా స్వాధీనంలోకి వచ్చాయి. ఇష్టమొచ్చిన విధంగా కదలించగలుగుతున్నాను.

తలుపు తెరచుకొంది. తెల్లటి బట్టలు వున్న అందమైన అమెరికన్ నర్స్ లోనికొచ్చింది.

"మార్నింగ్ సిస్టర్!" నన్ను గమనించకముందే ఆమెను పలకరించాను. విస్తుపోతూ నా బెడ్ కేసి చూసి చక చక అడుగులేసుకుంటూ వచ్చి నిలుచుంది మంచం ప్రక్కగా.

"హౌ డూ యూ ఫీల్!" అడిగింది ఆమె నన్ను. ఆనందాశ్రువులు ఆమె అందమైన గుండ్రని కళ్ళను తడిపి వేస్తూండటం గమనించాను.

"ఎక్సలెంట్. మళ్ళా పుట్టినట్లు ఆనందంగా వుంది" అన్నాను.

"కరెక్ట్! మీరు నిజంగా మళ్ళా జన్మించారు!"

"సిస్టర్! నాతో రెండు నిముషాలు నిదానంగా మాట్లాడే తీరికుందా?" అడిగాను మెల్లగా.

“ఓ! యస్!” అంటూ, మూలనున్న స్టూలు లాక్కొచ్చి వేసుకుంది.

“నన్ను ఎలా రక్షించారో తెలుసా?” అడిగాను నా మొదటి ప్రశ్న.

“నాకంత వివరంగా తెలీదు. డాక్టర్ డేనియల్ నడి గితే చెప్పగలరనుకుంటాను. మిమ్మల్ని తీసుకొచ్చాక నన్ను విమానంలో పిలిపించారు” అందామె.

“ఐ. సీ. నాతోపాటు మరో స్త్రీ కూడా వుండాలి. ఆమెకెలావుంది” అడిగాను ఆతృతగా.

“ఆమె చాలా బాగుంది.”

“నాకన్నా బాగుందా?”

“ఆఁ!”

“లేచి తిరుగుతూందా?”

“లేదు!”

“మంచంపైనే వుందా? నీతో ఎప్పుడన్నా మాట్లా డిందా? నన్ను గురించి అడిగిందా?” ప్రశ్నలవర్షం కురిపిం చాను ఆమెపైన.

“నేను ఆమెను అటెండు కావటంలేదు. మరో నర్సు వుంది. డాక్టర్లు చెప్పేదాన్నిబట్టి ఆమె పరిస్థితి బాగుందనే ఊహించాను” అందామె.

“ఐ సీ! నా కోసం నువ్వు ఈ దినం వీలు చూసుకుని ఆమెదగ్గరకు వెళ్ళి మాట్లాడి రావాలి. నేను క్షేమంగా వున్నట్లు ఆమెకు చెప్పాలి. ఆమె లేచి రాగలనంటే ఒక్కమారు నా గదికి తీసుకురావాలి. ఇది చాలా అవ సరం. ఆమెను ఒక్కసారి చూస్తే చాలు. బ్రతకాలన్న కాంక్ష, త్వరగా కోలుకోవాలన్న కోరిక బలీయ మవు

తాయి. మీ మందులతోకన్నా, త్వరగా మామూలు మని షిని కాగలుగుతాను" అన్నాను ఆవేశంగా.

"ఐ కెన్ అండర్‌స్టాండ్! ప్రయత్నిస్తాను" అందామె లేస్తూ.

"ప్రయత్నించడం కాదు సిస్టర్! ఎలాగైనా, నా కోరిక తీర్చాలి!" అన్నాను.

ఆమె లేచి ఇంజక్షనేదో లోడ్ చేసింది. నా చేతి కిచ్చింది. మందొక చిన్నగ్లాసులో పోసి పట్టించింది. త్రాగాను.

సిస్టర్ తలుపు దగ్గరగా లాక్కొని వెళ్ళిపోయింది.

అది మధ్యాహ్నమో, సాయంత్రమో నాకు తెలీలేదు. చాలాసేపటిదాకా సిస్టర్‌కోసం ఎదురుచూస్తూ కళ్ళు తెరచుకుని వున్నాను. కానీ ఆమె రాలేదు.

తలుపు కదలినట్లయింది. తల త్రిప్పి చూశాను. నల్లటి సూట్‌లో వున్న పొట్టిమనిషి లోనికొచ్చాడు. అతని మెడపైన స్టెతస్కోపు అడ్డంగా వ్రేలాడుతూంది.

"ఎలా వుంది!" వచ్చి స్టూలుపైన కూర్చుంటూ అడిగాడు డాక్టరు.

"బావుంది! డేనియల్ మీరేనా?"

"అవును. నా పేరు నీకెలా తెలుసు?"

"సిస్టర్ చెప్పింది!" అన్నాను.

"ఐ సీ" అంటూ స్టెత్ పెట్టి అక్కడక్కడా పరీక్షించసాగాడు. నేను ఊపిరి తీసుకుంటూ, వదులుతూ వుండిపోయాను.

"ఇంకొంత బలం కావాలి! అప్పుడు లేచి తిరుగుతావ్. అందాకా ఇలా బెడ్‌పైనే రెస్ట్ తీసుకోక తప్పదు" అన్నాడు డేనియల్.

"మీకు నేను ఋణపడి వున్నాను, చాలా!" అన్నాను కృతజ్ఞతగా.

"నాకు కాదు బాబూ! ఆ దేవుడికి. మనిషికీ మనిషికీ మధ్య ఋణాలుండవు. ప్రేమమాత్రమే వుంటుంది."

"అలాగనుకోవడం మీ గొప్పతనం మాత్రమే! అసలు నన్నెలా రక్షించారు డాక్టర్!" అడిగాను ఆతృతను అణచుకోలేక.

"ఈ దీవిలో పరిశోధనలకోసం నియమించబడ్డ రిసెర్చి టీములో పనిచేసే డాక్టర్ని నేను. విషపు గాలులు వీచే సమయం పూర్తికాగానే మేమంతా ఇక్కడకు చేరుకొన్నాం. నువ్వు రాసిపెట్టిన మెసేజ్ చూశాం. దాని ప్రకారం అందరం వెతుక్కుంటూ వెళ్ళాం. ఆ గాలులు వీచిన సమయంలోనే పెద్ద ఇసుక తుఫానుకూడా రేగింది. మీరు దాదాపు పదహారు అడుగుల లోతు ఇసుకలో కూరుకుపోయారు. మేము మొత్తం పాతికమందిమి ఒక రోజంతా శ్రమించాం. ఆ ఇసుకంతా తోడి, చూడగానే నువ్వూ నీతో వున్న అమ్మాయి పడివున్నారు. అసలు మీ ఇద్దరికీ ప్రాణాలు ఎప్పుడో పోయివుంటాయని ముందే అనుకున్నాం. కానీ నా ప్రాథమిక పరీక్షలో మీరు ఇంకా బ్రతికివుండటం గమనించాను. వెంటనే ఇక్కడకు తరలించుకొచ్చాం. అవసరమైన మందుల్నీ, ఇద్దరు నర్సుల్నీ అమెరికానుండి విమానంలో తెప్పించాం. ఇది జరిగి ఇవాల్టికి నలభైమూడు రోజులయింది. దేముడి దయవల్ల నువ్వు మూడ్రోంతులు కోలుకొన్నావు. మరో కొద్దిరోజుల్లోనే మామూలు మనిషి వవుతావ్!" అన్నాడు డాక్టర్ డేనియల్.

"ఆమె కెలా వుంది?" అడిగాను.

డాక్టరు క్షణకాలం మాట్లాడలేదు. చూపులు ప్రక్కకు త్రిప్పాడు.

"డాక్టర్ చెప్పరెందుకు? డెల్లా కేమయింది?" అసలు ప్రాణాలతో వుందా? లేదా?" అడిగాను గట్టిగా.

"ప్రాణాలతో వుంది. కానీ, బ్రెయిన్ బాగా దెబ్బ తినింది. ఆమె కెవ్వరూ గుర్తులేదు. ఏ పాత సంఘటనా గుర్తు రాదు. షి ఈజ్ మెంటలీ క్రిపుల్డ్!" అన్నాడు డేనియల్.

"ఎక్కడుంది?" అడిగాను ఆవేదనను ఆపుకోలేక.

"ఇక్కడే! క్రింది గదుల్లో వుంది. ఇప్పటికి రెండుసార్లు తప్పించుకుపోయింది. వెతుక్కొచ్చాం. మళ్ళా అలాంటి ప్రమాదం జరక్కుండా కాళ్లూ చేతులూ కట్టివేసి వుంచాం."

"డాక్టర్! ఆమె తిరిగి మామూలు మనిషి కావడం అసంభవమా?"

"అలాగని చెప్పడం డాక్టర్లకు చేతగాదు. ఈ ప్రపంచంలో ఏదీ అసంభవం గాదు. నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. ఆమెను మామూలు మనిషిని చెయ్యమని నాతోపాటు నువ్వూ భగవంతుణ్ణి వేడుకో! ఆమె గురించి ఎక్కువ ఆలోచించి నీ ఆరోగ్యం పాడు చేసుకోవద్దు. ఇంతదాకా మనం పడ్డ శ్రమంతా వృధా అవుతుంది" అన్నాడు డాక్టర్ డేనియల్.

"నేను త్వరగా కోలుకోవాలి! నా డెల్లాను మామూలు మనిషిని చేసే మీ ప్రయత్నాల్లో నేనూ పాలు పంచుకోవాలి" అన్నాను దృఢంగా.

"ఐ లైక్ దట్!" అంటూ లేచాడు డేనియల్.

డాక్టరు వెళ్ళిపోయాడు.

గదినిండా ఆవరించిన అపూర్వమైన దేవతాశక్తి ఏదో అదృశ్యమై పోయినట్లు బాధపడ్డాను డాక్టరు డేనియల్ వెళ్ళిపోగానే. ఆయన డెల్లాగురించి చెప్పిందంతా మళ్ళా మళ్ళా జ్ఞప్తికి తెచ్చుకుని పదేపదే పరిస్థితిని నెమరు వేసుకోనసాగాను.

మేమిద్దరం ఒకేరకం వాతావరణంలో, ఒకే లోతున, ఒకే ఇసుకక్రింద కూరుకుపోయినవాళ్ళం. కానీ విధి లిఖితం. నన్ను బాగా చూసింది. డెల్లాను అన్యాయం చేసింది.

బొంబాయి వదలింది మొదలు ఇంతదాకా మనుషులతో ప్రకృతితో మా ప్రాణాలకోసం నిరంతరం పోరాడుతూనే వున్నాం. ఇప్పుడు డెల్లాగురించి భగవంతుడితో కూడా పోరాటం పెట్టుకోక తప్పేట్లు లేదు.

డేనియల్ పైన నాకు అచంచలమైన విశ్వాసం కుదిరింది. ఆయన ముఖంలో ఒక వింత వర్చస్సు స్ఫుటంగా కనుపించింది. ఆయన చికిత్సలోనే డెల్లా మామూలు మనిషి కావాలి. లేకుంటే ఇంక జీవితాంతం ఆమె అదే స్థితిలో వుండవలసిందే ననుకున్నాను.

ఆమె గురించి ఆలోచించగూడదనే అనుకున్నాను. కానీ క్షణక్షణానికీ ఆమె ఆలోచనలు వస్తూనే వున్నాయి. పాత సంఘటనలు గుర్తుకు రాసాగాయి. తెలీకుండానే నా కళ్ళలోనుండి ధారావాహికంగా కన్నీళ్ళు కారి కణతల పైగా చెవులమీద పడసాగాయి.

తలుపు త్రోసిన అలికిడయింది.

కళ్ళు చేత్తో తుడుచుకుని చూశాను.

సిస్టర్ కనుపించింది.

మెల్లిగా నా మంచం దగ్గరకు వచ్చింది.

"డాక్టర్ డేనియల్ వచ్చారా?" అడిగింది ఆమె.

"ఆఁ! వారిని నువ్వే పంపావా?" అడిగాను నవ్వుతూ.

"లేదు! మీ కోరిక చెప్పాను. వారు తనే వెళ్తా మన్నారు. అంతే!" అంది సిస్టర్.

"థాంక్ యూ! కనీసం ఆ మాత్రం సాయమన్నా చేశావ్?" అన్నాను.

"ఆయన మీ గరల్ ఫ్రండ్ గురించి వివరంగా చెప్పారా?"

"చెప్పారు! ఆమె గరల్ ఫ్రండ్ కాదు!" అన్నాను.

"మరి?" ప్రశ్నార్థకంగా చూసింది నాకేసి సిస్టర్.

"నా వైఫ్!"

"ఐ. సీ. ఎక్కడా చేతికి వెడ్డింగ్ రింగ్ కనుపించ లేదు! అందుకని అలా అనుకున్నాను."

"అందరిలా మేము చర్చిలో పెళ్ళిచేసుకో లేదు. అడవుల్లో చేసుకున్నాం. మనస్సులు కలియటం ప్రధానం తప్ప, ఉంగరాలు కాదుగా?"

"నిజమే! రింగులు మార్చుకున్నంత సులభంగా హృదయాలు ఇచ్చి పుచ్చుకోలేకపోయిన పెళ్ళిళ్ళు అమెరికాలో ఎన్నో చూసాను" అంది సిస్టర్.

"నీకు పెళ్ళయిందా?" అడిగాను ఉబుసుపోక.

"అయింది. ఆ తర్వాత నెలరోజులకే డైవర్స్ కూడా అయిపోయింది. ఆ చేదు అనుభవంతో ఇక జీవితంలో పెళ్ళిమాట తలపెట్టకూడదని తీర్మానించుకున్నాను.

అందుకే నర్సింగ్ కోర్స్ చదివి, ఇలా మనుషులకు చేత నయిన సేవచేస్తూ చనిపోవాలని నిర్ణయించుకున్నాను" అంది సిస్టర్.

ఆమె అనుభవం విన్నాక నాకు బాధకలిగింది. ఆమెను ఓదార్చే అవసరం ఎవ్వరికీ లేకుండా, తనే జీవితానికో దారి చూసుకుంది. ఇప్పుడు నేనూ అలాంటి స్థితిలోనే పడ్డాను. డెల్లా ఆరోగ్యం కోలుకోకపోతే, ఆమెను చంపి, నేను చచ్చి, మా సమస్య ప్రపంచానికీ, ముఖ్యంగా, నా ఎదురుగా వున్న సిస్టర్‌లాంటి, మంచి మనుషులకు, డాక్టర్ డేనియల్‌లాంటి దేవతామూర్తులకు, లేకుండా చేద్దామనుకున్నాను.

సిస్టర్ ఇంజక్షను చేసింది. మందేదో ఇచ్చింది. బ్లాంకెట్ కప్పి లైటార్పి, సన్నటి వెలుతురునిచ్చే నైట్ బల్బ్ స్విచ్ ఆన్ చేసి, తలుపులు దగ్గరగా లాగి, వెళ్ళిపోయింది.

పిచ్చి పిచ్చి ఆలోచనలు చేసుకుంటూ, వెలుతురును కొలుస్తూ నాకు తెలీకుండానే ఎప్పుడో నిద్రలోకి జారి పోయాను.

అలా దాదాపు పదిరోజులు జరిగిపోయాయి. సిస్టర్ వచ్చి మందిస్తూనే వుంది. డాక్టర్ డేనియల్ అప్పుడప్పుడు పరీక్షలు చేస్తున్నాడు.

నాకు మాత్రం లేచికూచునే ఓపిక రావడంలేదు. నేను తినే ఆహారం, తీసుకొనే మందులు ఏమవుతున్నాయో నాకన్నా డాక్టరుకే ఎక్కువ ఆశ్చర్యకరంగా తయారయింది. కాలకృత్యాలు మొత్తం బెడ్‌పైనే జరుగుతున్నాయి. నాకూ వీలయినంత వేగంగా లేచి కూర్చొనటమే గాకుండా, నడవాలనీ, పరుగెత్తాలనీ వుంది.

మరో రెండురోజులు గడిచాయి.

నా పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పేమీ కనుపించలేదు.

డాక్టర్ డేనియల్ వచ్చినప్పుడు అడిగాను. ఆయన ధైర్యం చెప్పాడు. తప్పకుండా లేచి తిరుగుతానని హామీ కూడా ఇచ్చాడు.

మరో మూడురోజులు జరిగాయి.

యథాప్రకారం సిస్టర్ వచ్చి ఇంజక్షను చేసింది. మందిచ్చింది. వెళ్ళబోయే ముందు నా బెడ్ ప్రక్కన కూర్చుంది. అలా ఆమె కూర్చోడం నాకు కొంత చిత్రంగా తోచింది.

"మిస్టర్ రాజ్!" పిలిచింది మెల్లగా.

"యస్! చెప్పండి సిస్టర్" అన్నాను ఆమెవైపు తల త్రిప్పి ఒత్తగిల్లి పడుకుంటూ.

"మీరంటే నాకు చాలా ఇష్టం!" అంది అకస్మాత్తుగా.

"ఎందుకని?"

"మీ రెన్నో సాహసాలు చేశారు! ఎన్నో విపత్కర పరిస్థితుల్లో మృత్యువు చేతుల్లో చిక్కుకునికూడా, ధైర్యం విడువకుండా, పోరాడి, ప్రాణాలతో బయటపడ్డారు. అన్నింటినీ మించి మీకు భార్యంటే చాలా ప్రేమ వున్న విషయం కనిపెట్టాను" అందామె ఆర్ద్రమైన కళ్ళతో. జేబురుమాలు తీసి వాట్ని అలవోకగా, అందంగా, ఒత్తుకోవడంకూడా గమనించాను.

"ఎలా కనిపెట్టారు?" అడిగాను.

"ఐ యామ్ ఎ లేడీ! అది ఎలా కనిపెట్టగలిగానో నాకు తెలుసు. కానీ మీకు చెప్పడం చేతకాదు! మీ

లాంటి వ్యక్తికి నేను భార్యను కాలేకపోయానన్న కొరత మాత్రం జీవితాంతం వుంటుంది. నా భర్త మీరు మీ భార్యపై చూపే ప్రేమలో పదోవంతు చూపించివున్నా ఇలా నర్సునయ్యే అవసరం లేకుండాపోయేది'' అందామె.

''మీ ఆవేదనను సమర్థించాలో, మీ భర్తకు కృతజ్ఞత చెప్పాలో అర్థంకాని అయోమయంలో పడవేశారు నన్ను మీ మాటలతో!'' అన్నాను.

''ఎందుకని?''

''మీ బాధ న్యాయమైనదే! అలాగే మీ భర్త మిమ్మల్ని వదిలివెయ్యకుంటే నాలాంటి దౌర్భాగ్యులకు హృదయమిచ్చి సేవించే నిజాయితీ గల నర్సులు ఎలా దొరుకుతారు సిస్టర్!'' అన్నాను.

''ఏది మంచో, ఏది చెడో మనం చూసే కోణాన్నిబట్టి కనిపిస్తూ వుంటుందని డాక్టర్ డేనియల్ చెప్తుంటాడు. మీ దృష్టిలో నాకు జరిగిన అన్యాయం మంచిదిగానే తోస్తూంది కదూ!'' అడిగింది బాధగా.

''ఊరకే అన్నాను! సీరియస్ గా తీసుకోకండి. జీవితం విలువైంది. మనకు గాకున్నా, మరొకరికి అదే ఉపయోగ పడే వీలుంటే చాలు. మన బ్రతుక్కి కొంత పరమార్థ ముంటుంది,'' అంటూ వేదాంతం చెప్పి సర్దాను.

ఆమె వెళ్ళిపోయేందుకు లేచి నిలుచుంది.

''సిస్టర్! డెల్లా కీ దినం ఎలా వుంది?'' అడిగాను.

''కాస్త నెమ్మదిగా వున్నట్లుంది. పెద్దగా అల్లరి చెయ్య లేదు. కాసేపు రెస్ట్ తీసుకుందికూడా నిద్రపోతూ'' అంది సిస్టర్.

"ఆమె మామూలు మనిషి అవుతుందా?"

"నేను డాక్టర్ని కాదు! నర్సును ఎలా చెప్పగలను?" ఎదురుప్రశ్న వేసింది నాకే.

"కాదు మామూలు మనిషిగా చెప్పండి."

"ఆమె మామూలు మనిషి కాలేదంటే ఏం చేస్తారు?" అడిగింది సిస్టర్.

అది ఆమెనుండి నేను ఆశించిన జవాబు కాదు. నేను అంత ఆత్రుతగా, ఆవేదనతో, ఆత్మీయురాలని ఆశించి అడిగినందుకన్నా, డెల్లా త్వరలోనే మామూలు మనిషి అవుతుందని చెప్పివుంటే ఎంతో ఆనందించగలిగేవాణ్ణి.

"ఏమీ చెయ్యను" అన్నాను దిగులుగా.

"అప్పుడే దిగజారిపోయారు. ఆమె త్వరలోనే కోలుకుంటుంది. డోంట్ ఆక్ట్ సిల్లీ. బై" అంటూ తలుపు మూసుకొని వెళ్ళిపోయింది.

కానీ ఆమె వేసిన ప్రశ్నలు, చెప్పిన జవాబులు నన్ను కొంత కలవరపెట్టాయి. కొద్ది దినాల క్రితంవరకు నన్నో ప్రేమంటుగానే చూసిన ఆమెకు ఉన్నట్టుండి ఆదర్శ పురుషుడిగా చూడవలసిన అవసరం, అగత్యం ఎందుకొచ్చి వుంటాయాని ఆలోచించసాగాను.

ఈ రిసెర్చి సెంటరులో వున్నవాళ్ళంతా మగవాళ్ళే. ఇద్దరు నర్సులుమాత్రమే వున్నారు. ఆ రెండో నర్సును నేనూ చూశాను. ఈమెలా అందమైంది కాదు. పొట్టిగా, బొద్దుగా వుంటుంది. ఎవరో వెనుకనుండి తరుముతున్నట్లు చకచక వచ్చినపని చేసుకువెళ్తుంది. ఏమైనా అడిగితే

క్లుప్తంగా జవాబు చెప్తుంది. మొహంలో చికాకు కొట్టొచ్చి నట్లు కనుపిస్తూ వుంటుంది. ఆమెకు ఎవరితోనన్నా సంబంధం వుందా? దానివల్ల, నా దగ్గరకెప్పుడూ వచ్చే నర్సు చూచేట్లు ఆనందం పొందివుంటే, ఈ మెకూడా అలాంటి కోరికలు కలగడం సహజం. అలా జరిగిందను కున్నా, ఆమె వెంట తిరిగిన వ్యక్తి పోను మరో ఇరవై మంది మగవాళ్లు వుండివుండాలీ దీవిలో. వాళ్ళల్లో ఎవరోన్నా ఒకర్ని చేరదీస్తే తన అవసరం సులభంగా తీరిపోయేది.

అలాగాకుండా, లేచి కూర్చోవటంకూడా చేతకాని, నాలాంటివాణ్ణి ఐడియల్ మనిషిగా ఊహించుకోవటం వెనుకనున్న రహస్యమేమిటి?

ఇంతలో డెల్లా గుర్తొచ్చింది. ఆమె గురించి అమెరికన్ నర్సు చెప్పిన సమాచారం తలచుకొని ఆనందించాను. ఆమెకూడా త్వరలోనే ఆరోగ్యం కుదుటపడితే, ఇద్దరం కలసి ఏదైనా దేశం వెళ్ళి, చేతనయిన పని చేసుకుంటూ, ప్రశాంతంగా జీవించాలనిపించింది.

ఎలాంటి ఇల్లు కట్టుకోవాలో, ఎటువంటి అందమైన చెట్లు వెయ్యాలో, ఎంతమంది పిల్లల్ని పెంచాలో, వాళ్లను ఎలా చదివించాలో, లాంటి అందమైన బంగారు ఆలోచనలు చేస్తూ కాలం గడుపుతూ పడుకున్నాను. రాత్రి సగం పైనే గడచిపోయి వుండాలని అనుకున్నాను. కళ్ళు బలవంతం చేసినా మూత పడటంలేదు.

(సశేషం)